

మహిళా మార్టుకు దెబ్బ

మహిళా మార్ట్‌ను కూటమి దెబ్బ తీస్తోంది. క్రమేపీ వ్యాపారాలు పడిపోతున్నాయి.

- 8లో



నువ్వా-నేనా

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ఆసక్తిగా సాగుతోంది. ఆటగాళ్లు అదరగొడుతున్నారు.

- 8లో

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరగనుంది. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనాలి



నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 21న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం మండల కేంద్రాలు, నియోజక వర్గ కేంద్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ సమన్వయకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఇతర పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ సభ్యులు, నాయకులు అందరూ పాల్గొనాలని సూచించారు. అన్ని చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పార్టీ నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే నరసన్నపేటలో శనివారం ఆస్పత్రిలో పండ్లు పంపిణీతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ ప్రధాన నాయకులు అందరూ ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



గురుకులంలో విద్యార్థులకు భోజనం పెట్టే విధానాన్ని పరిశీలిస్తున్న బాలాజీ

పాతపట్నం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా లక్ష్యాన్ని పెట్టుకుని చదువుకోవాలన్నారు. విద్యార్థుల వంట గది, మరుగుదొడ్లను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థినుల భోజనం, కూరను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్చన, కొల్లివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ



పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదో తరగతి ఇంగ్లిష్ మీడియం మోడల్ పేపర్స్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. మంచి మార్కుల స్కోరింగ్‌కు ఉపయోగపడే ఈ పుస్తకాన్ని విద్యార్థులకు సరసమైన ధరలకు అందించడం మంచి పరిణామమని జాయింట్ కలెక్టర్ అన్నారు. యూటీఎఫ్ సంస్థ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల సంక్షేమాన్ని కూడా చూడడం చాలా ఆనందించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్ అన్నాజీరావు, అకడమిక్ కమిటీ కన్వీనర్ ఎల్‌వీ చలం, కోదండ రామయ్య పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో మెరైన్ ఎస్పీ రవివర్మ



రవివర్మకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని తీర ప్రాంత రక్షణ దళం (మెరైన్) ఎస్పీ రవివర్మ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించగా.. ఈవో జి.గురునాథరావు స్వామి చిత్రపటాన్ని, క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు కళింగపట్నం మెరైన్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద పర్యవేక్షించాలని సూచించారు. ఆయనతో పాటు కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ బూర ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గార: బందరువానిపేటలో ముందుకు వచ్చిన సముద్రం



కన్నీరే కడుపు నింపాలిక..

- వరుస తుఫాన్లతో మత్స్యకారుల గుండెల్లో గుబులు
- వేట సాగక ఇబ్బంది పడుతున్న గంగపుత్రులు
- గత పదేళ్లలో అక్టోబర్ -డిసెంబర్ మధ్య 13 తుఫాన్లు
- రూ.20వేలు భృతి ఇస్తామంటూ ఇవ్వని కూటమి ప్రభుత్వం



వజ్రపుకొత్తూరు /ఎచ్చెర్ల క్యాంపస్

వరుస తుఫాన్లు మత్స్యకారుల బతుకుల్లో అలజడి రేపుతున్నాయి. సాధారణంగా అక్టోబర్, నవంబరు నెలల్లో జిల్లాపై తుఫాన్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా మత్స్య సంపద అధికంగా లభించే సమయంలో తుఫాన్లు వస్తుండడంతో గంగపుత్రులకు నష్టం తప్పడం లేదు. జిల్లాలో 193 కిలోమీటర్ల తీర ప్రాంతం 11 మండలాల్లో విస్తరించి ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, గార, సంతబొమ్మాళి, పోలాకి, వజ్రపు కొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో సముద్రంలో చేపల వేట చేసి బతుకుతున్న మత్స్యకార కుటుంబాలు దాదాపు 16,569 ఉన్నాయి. వేట సాగితేనే వీరికి రోజులు గడుస్తాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించక సంద్రంలోకి వెళ్లడమే కుదరడం లేదు. దీనికి తోడు అధికార కూటమి ప్రభుత్వం మత్స్యకారుల కష్టాలపై కన్నెత్తి కూడా చూడడం లేదు. 2014-19 మధ్య కూడా మత్స్యకారులకు వేట నిషేధ భృతి పేరుతో అరకొరగా ఐదారు వేల మందికి కేవలం రూ.4000 అందజేసేవారు. అనంతరం వైఎస్ జగన్ ప్రభుత్వంలో తేదీ చెప్పి మరీ రూ.10వేలు సాయం అందించారు. వేట నిషేధ సమయం ముగియగానే ఏటా మే నెల 2వ వారంలో గంగపుత్రుల బ్యాంకు ఖాతాల్లో ఈ డబ్బులు పడేవి. ఈ ఏడాది మాత్రం వేట నిషేధ భృతి ఊసే లేదు.

బెంగ తీర్చని భృతి..

ఏటా తుఫాన్లు, వేట నిషేధం కష్టాల నుంచి గంగపుత్రులను గట్టెక్కించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేట నిషేధ భృతి, మత్స్యకార భరోసా అనుకున్న సమయానికి వేసేది. డీజిల్ సబ్సిడీ నేరుగా పెట్రోల్ బంకుల వద్దే అమలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల పథకాలన్నీ గాలి కొదిలేసింది. మత్స్యకార భరోసా రూ.20వేలకు పెంచి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు దానిపై కసరత్తు కూడా చేయలేదు.

పరివేత జాబితా సిద్ధం

జిల్లాలో 16 లక్షల టన్నుల చేపలు ఏడాదికి ఉత్పత్తి చేస్తుండగా, అందులో దాదాపు 5.60 లక్షల టన్నుల చేపలు ఎండు చేపలుగా మార్చి కోళ్ల ఫారాలకు మేతగా తరలిస్తున్నారు. వేట సన్నగిల్లడంతో గత నాలుగు నెలలుగా ఉత్పత్తి తగ్గి గంగపుత్రులు తీవ్రంగా నష్టపోయారు. మత్స్యశాఖ మే నెలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేయగా నవశకం బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో ఆరు దశల్లో వడపోయగా 2423 మందిని అనర్హులుగా తేల్చారు. ఇందులో 100 లీటర్లు కనీస వినియోగం లేని మోటారు బోట్‌లలో పని చేస్తున్న 1890 మందికి అనర్హులుగా పేర్కన్నారు. దీంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది.

ఏటేటా విపత్తులే..

ఏటా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వరుస తుఫాన్లు వస్తున్నాయి. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లలేకపోతున్నారు. ఇక్కడ ఉపాధి లేక విశాఖపట్నం, సూరత్, చెన్నై, కాండ్లా, గోవా తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారు. సంద్రంలో మత్స్య సంపద చిక్కక పోవడంతో సముద్ర చేపల ఉత్పత్తి తగ్గి ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెరువు చేపలను దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చింది. దీంతో మత్స్యకారుల కుటుంబాలు చితికిపోతున్నాయి.



గార: బందరువానిపేటలో ఒడ్డున ఉన్న పడవలు

వేట సాగటం లేదు



అల్పపీడనం, వాయుగుండాలు వల్ల వరుస తుఫాన్లు వస్తున్నాయి. చేపల వేటకు వెళ్లవద్దని అధికారులే దండోరాలు వేయిస్తున్నారు. దీంతో ఇంటి దగ్గర ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్నాను. ఇస్తామన్న రూ.20వేల భరోసా ఇచ్చి ఉంటే ఖర్చులు గట్టెక్కేవి. అప్పుల భారం పెరిగిపోయి మా ఊరులో చాలా మంది గోవా, కాండ్లా వలస పోతున్నారు.

– సీహెచ్ నీలయ్య, మత్స్యకారుడు భావనపాడు

పరిహారం ఇవ్వాలి



తుఫాన్ల సమయంలో వేటకు వెళ్లవద్దని చెబుతున్న ప్రభుత్వం ఆ సమయంలో మాకు నష్టపరిహారం ఇవ్వాలి. డీజిల్ సబ్సిడీలు పెంచాలి. ఐదారుగురం కలిసి వేటకు వెళితే కనీసం డీజిల్ ఖర్చులు రావటం లేదు. ప్రభుత్వం వేట నిషేధ భృతి ఇవ్వడంతో పాటు ఆధునిక వేట సామగ్రి సబ్సిడీపై అందించాలి.

– జి.శంభూరావు, మత్స్యకారుడు, మంచినీళ్లపేట



వలలు భద్రపరుచుకుంటున్న మత్స్యకారులు

నేటి నుంచి తిలారు జంక్షన్ మీదుగా రాకపోకలు బంద్

జలుమూరు: తిలారు జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణంలో భాగంగా ఈదారిలో 20 రోజుల పాటు రాకపోకలు బంద్ చేస్తున్నట్లు జాతీయ రహదారుల అనుబంధ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాతపట్నం, శ్రీముఖలింగం వెళ్లే వాహనాలను దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. వాహనదారులు గమనించాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ రామారావుకు సమాచారం అందజేశారు.

రాష్ట్ర పండుగగా రథసప్తమి

- తొలిసారిగా మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ఆలయ నిధులే తప్ప ప్రభుత్వం తరఫున నిధుల కేటాయింపు లేదని స్పష్టీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశిష్టమైన పర్వదినంగా ఏటా మాఘ శుద్ధ సప్తమి నాడు నిర్వహిస్తున్న సూర్యజయంతి (రథసప్తమి) ఉత్సవాన్ని ఇకపై రాష్ట్ర పండుగగా నిర్వహించేలా దేవదాయ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సూచన మేరకు రథసప్తమిని తొలిసారిగా మూడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా జరిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించడంతో రానున్న ఫిబ్రవరి 4న రథసప్తమిని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే సప్తమికి ముందు ఒకరోజు, సప్తమికి తర్వాత ఒక రోజు ఉత్సవాలు నిర్వహిస్తారా లేదా సప్తమి తర్వాత వరుస రెండు రోజుల పాటు ఉత్సవాన్ని జరిపిస్తారా అనేది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. ఏటా రథసప్తమికి విశిష్టంగా నిజరూపం, పంచామృతాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో గట్టి ఏర్పాట్లతో పాటు సౌకర్యవంతంగా దర్శనాన్ని కలిగించేలా ఈ ఏడాది పక్కాగా ఉత్సవాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే రాష్ట్ర పండుగగా నిర్ణయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధుల కేటాయింపును ప్రస్తావించకపోవడంతో ఎప్పటిలాగానే ఆలయ నిధులనే వినియోగించి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించాల్సి ఉంది.

పెట్రోల్ బంక్‌లో మంటలు



టెక్కలిలో ఆయుష్ పెట్రోల్ బంక్‌లో ఫిల్లింగ్ పైపుల నుంచి చెలరేగుతున్న మంటలు

- ఫిల్లింగ్ పంపులు మార్పు చేస్తుండగా ఘటన
- భయాందోళనతో పరుగులు తీసిన స్థానికులు
- అగ్నిమాపక సిబ్బంది చొరవతో తప్పిన ప్రమాదం

టెక్కలి: స్థానిక పాత జాతీయ రహదారిలో గల ఆయుష్ పెట్రోల్ బంక్‌లో గల ఫిల్లింగ్ పంప్‌లో గురువారం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. పట్టణానికి మధ్యలో వేలాది లీటర్ల పెట్రోల్, డీజిల్ నిల్వలతో ఉన్న బంకులో ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో ఏం జరుగుతుందోనని సమీప ప్రాంతాలకు చెందిన స్థానికులు, వ్యాపారులు భయపడ్డారు. బంక్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫిల్లింగ్ పంపు మార్పు చేసే క్రమంలో ఒక్క సారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అయితే పెట్రోల్, డీజిల్ నిల్వలు కలిగిన ట్యాంకుల వద్ద ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఫిల్లింగ్ పంపు మెషిన్ పూర్తిగా కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని బంక్‌లో మంటలు వ్యాపించడంపై విచారణకు ఆదేశించారు. అలాగే టెక్కలి సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ రాముతో పాటు ఆర్ఐ ఢిల్లేశ్వరరావు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



సోంపేట తపాలా కార్యాలయం వద్ద పోస్టుకార్డులతో బీసీ వెల్ఫేర్ నాయకులు

సోంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోంపేటలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయవద్దని ప్రధాన మంత్రికి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాయన్నారు. లక్షల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు తొలగించడం న్యాయం కాదన్నారు. ఎన్నో త్యాగాల ఫలితంగా ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారని, ప్రైవేటు పరం చేస్తే మళ్లీ ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, విజయ దుర్గా ఆటోయూనియన్ అధ్యక్షుడు పిట్ట హేమచంద్రరావు, జింకిభద్ర ఉపసర్పంచ్ సాహుకారి జాని, సంఘ ప్రతినిధులు అంజిత్ కుమార్, కణితి లోకేష్, తెలుకుల మోహనరావు, తెప్పల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చలిగాలులు.. చిరు జల్లులు



సారవకోట: రామకృష్ణాపురంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులు కురిశాయి. వాతావరణం చల్లబడి, చలి కూడా పెరిగింది. చాలా గ్రామాల్లో వరి కోతలు పూర్తయ్యి పొలాల్లో కుప్పలు పెట్టి ఉన్నారు. వాటిని జాగ్రత్త చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గురువారం నాటికి జిల్లాలో 99.00 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కంచిలిలో 17.2, కవిటిలో 14.0, జి సిగడాంలో 8.8, సరుబుజ్జిలిలో 6.2, సోంపేటలో 5.2, లావేరులో 4.2, బూర్జలో 4.2, టెక్కలిలో 4.0, పొందూరులో 3.8, ఎచ్చెర్లలో 3.4, రణస్థలంలో 3.2, శ్రీకాకుళంలో 2.8, ఇచ్ఛాపురంలో 2.6, ఆమదాలవలసలో 2.6, సంతబొమ్మాళిలో 2.4, సారవకోటలో 2.2, పలాసలో 2.2, గారలో 1.8, నందిగాంలో 1.6, పాతపట్నంలో 1.4, హిరమండలంలో 1.4, మెళియాపుట్టిలో 1.2, కోటబొమ్మాళిలో 1.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగిలిన మండలాల్లో వర్షం కురవలేదు. అక్కడక్కడా చిరు జల్లులు కురిశాయి.

తీర ప్రాంత పరిరక్షణకు చర్యలు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తీర ప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన అంశాలపై తొలుత సమీక్షించారు. సముద్రతీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకోసం గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని ఎస్పీ కోరారు. వాచ్ టవర్స్ ఏర్పాట్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. తీరప్రాంతాల్లో హోర్డింగ్స్, బారువ, కళింగపట్నం ప్రాంతాల్లో లైఫ్ జాకెట్స్, బోట్స్ అవసరమని సభ్యులు కోరగా కలెక్టర్ తదుపరి చర్యలు నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. సముద్రం వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీ చేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకువెళ్లడం లేదని తెలియజేయడంతో మత్స్యకారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో కోస్టల్ గార్డ్ ఎస్పీ రవి వర్మ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.రాము, మత్స్యశాఖ ఉపసంచాలకులు పీవీ శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు టి.సంతోష్ కుమార్, తీర ప్రాంత సీఐలు, ఎస్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు వేదిక

క్రిస్మస్ స్పెషల్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులో ఉన్న క్రిస్టియన్ వర్షిప్ సెంటర్ అర్ధ శతాబ్ద కాలంగా ప్రార్థనలకు వేదికగా ఉంది. 1969లో క్రైస్తవ ప్రచారకుడు రెవ.గోడి శామ్యూల్ మొదట ఒక చిన్న మందిరంగా ఏర్పాటు చేశారు. 2004 నవంబరు 7న దీన్ని పునరుద్ధరణ చేసి అతిపెద్ద ప్రార్థన మందిరాలను నిర్మించారు. ఇక్కడ సుమారు 1500 మంది ప్రార్థనలు చేసేందుకు వీలుగా నిర్మాణాలు చేశారు. 23న సాయంత్రం 5గంటలకు క్రిస్మస్ కేరల్స్ పార్టీ గృహాలు సందర్శించడం జరుగుతుందని, 24న సాయంత్రం 5గంటలకు కేండిల్ లైట్ సర్వీస్ జరుగుతుందని, 25న ఉదయం 9గంటలకు క్రిస్మస్ ఆరాధన ఉంటుందని తెలిపారు.

– శ్రీకాకుళం కల్చరల్



క్రిస్టియన్ వర్షిప్ చర్చి

క్లుప్తంగా

21 నుంచి ఏయూ వారాంతపు తరగతులు

శ్రీకాకుళం: ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీకాం 1, 2 సెమిస్టర్లకు ఈ నెల 21 నుంచి వారాంతపు తరగతులు నిర్వహించనున్నట్లు ఏయూ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాలురు)లో జరిగే ఈ తరగతులకు విద్యార్థులు గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ



డివైడర్‌పై ఆగిన లారీ

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట జాతీయ రహదారిపై గురువారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. కుర్దా నుంచి విశాఖపట్నం వైపుకు ప్లై వుడ్ సామగ్రితో వెళ్తున్న లారీ అదుపు తప్పి గుండవల్లిపేట వద్ద డివైడర్ పైకి ఎక్కింది. వెంటనే డ్రైవర్ అప్రమత్తం కావడంతో డివైడర్‌పై ఆగిపోయింది. అదే వేగంతో సర్వీసు రోడ్డుపైకి వెళ్తే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. రోడ్డుపై ఆ సమయంలో అనేక మంది ఉన్నారని, అలాగే సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఇళ్లు ఉన్నాయని చెప్పారు. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి డివైడర్ మీదే లారీ ఉండిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు కూడా ఎటువంటి గాయాలు కాలేదు. బుధవారం కోటబొమ్మాళి మండలం పాకివలస, ఇటీవల రణస్థలం వద్ద జరిగిన ప్రమాదాల్లో కార్లు అదుపు తప్పి డివైడర్ దాటి రోడ్డుపైకి దూసుకెళ్లడంతో ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే.

బైకును ఢీకొట్టిన కారు

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం, కారు

నరసన్నపేట: మండలంలో జమ్ము దాటిన తర్వాత జాతీయ రహదారి(326ఏ)పై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం ఊడికలపాడుకు చెందిన తండ్రీకొడుకులు వావిలపల్లి సింహాచలం, తవిటయ్యలకు గాయాలయ్యాయి. ఇంటి నుంచి నారాయణవలస సంతకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చల్లపేట వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సింహాచలంకు ఎడమ చేయి విరగడంతో పాటు తవిటయ్యకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా, కారు ముందు భాగం ధ్వంసమైంది. సింహాచలం ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టూరిస్ట్ బస్సు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన బస్సు

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి కూడలి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో టూరిస్టు బస్సు బోల్తాపడింది. ఒడిశా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన యాత్రికులు రాజస్థాన్‌కు తీర్థయాత్రకు వెళ్లి తిరిగి స్వస్థలాలకు బయలుదేరారు. మాకన్నపల్లి కూడలికి వచ్చేసరికి లారీని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో బరంపురం పట్టణానికి చెందిన రాజేంద్ర బెహరా, కురు బెహరాకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వేకువజామున ఘటన జరగడంతో భయాందోళనకు గురైన స్థానికులు తేరుకుని 108కు సమాచారం అందించారు. వెంటనే పలాస 108 ఈఎంటీ మోహనరావు, పైలెట్ వెంకటరావులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన వారిని తరలిస్తున్న 108 సిబ్బంది

మహిళా మార్టుకు..

కూటమి దెబ్బ



నరసన్నపేటలో వెలవెలబోతున్న మహిళా మార్టు

- నాడు రూ.లక్షల్లో వ్యాపారం
- నేడు నష్టాల దిశగా పయనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- జిల్లాలో ఇతర పట్టణాల్లో విస్తరణకు తూట్లు
- అయోమయంలో మహిళా సంఘాలు

నరసన్నపేట: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఏర్పాటైన మహిళా మార్టులు తిరోగమనంలో పయనిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయల వ్యాపారంతో కళకళలాడిన మార్టులు కూటమి ప్రభుత్వం వచ్చాక నష్టాలను చవిచూస్తున్నాయి. రోజూ వేలాది రూపాయలు జరిగే ఈ స్టోర్లలో నేడు కనీస స్థాయిలో కూడా వ్యాపారం జరగక నిర్వాహకులు దిగాలు చెందుతున్నారు. దీనంతటికీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక జిల్లాలో ఇతర పట్టణాల్లో మహిళా మార్టుల విస్తరణ పూర్తిగా మరుగునపడిపోయింది. 2022 డిసెంబర్ 14న నరసన్నపేటలో మహిళా మార్టును ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ప్రభుత్వం, సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు ప్రతిష్టాత్మకంగా భావించి మార్టుల నిర్వహణకు ప్రాధాన్యమిచ్చారు. మంచి వ్యాపారం చేపట్టి రాష్ట్రంలోనే నరసన్నపేట మార్టు ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇప్పటి వరకూ రూ.3.94 కోట్లు టర్నోవర్ సాధించింది. పది మంది వరకూ మహిళలు ఇక్కడ పనిచేసేవారు.

మొక్కుబడిగా నిర్వహణ...

మహిళా మార్టులో గతంలో రోజుకు రూ.40 వేల నుంచి లక్ష రూపాయల పైబడి వ్యాపారం జరిగేది. దీంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారయ్యే ఉత్పత్తుల విక్రయాలు కూడా ఇక్కడే జరిగేవి. తద్వారా ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందేవి. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్టు కావడం వల్ల ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ లభించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి భిన్నంగా తయారైంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, కొనుగోలు లక్ష్యాలు విధించకపోవడంతో ప్రస్తుతం రోజుకు ఐదారు వేలు వ్యాపారం కూడా జరగడం లేదు. గడిచిన రెండు నెలలుగా పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పర్యవేక్షణ లేక మొక్కుబడిగా మార్టు నిర్వహిస్తున్నారు. ముగ్గురు మాత్రమే సిబ్బంది ఉన్నారు. మొదట్లో ఉన్న సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించారు. ప్రస్తుతం మార్టు నష్టాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఆడిట్‌లో నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. ఐకేపీ అధికారులు విక్రయాల్లో రాష్ట్రంలో మొదటి పది స్థానాల్లో ఉండే నరసన్నపేట మహిళా మార్ట్ ప్రస్తుతం నష్టాల్లో పయనిస్తోంది. నరసన్నపేట మండలంలో 1998 మహిళా సంఘాలు ఉండగా దీంట్లో 24.512 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 22,500 మంది నుంచి మహిళా మార్టు కోసం రూ.110 వసూలు చేశారు. వీరందరికీ షేర్ ధనం రూపేన భాగసామ్యం కల్పించారు. ప్రస్తుతం ఈ షేర్ ధనం కూడా మాయం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మార్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

2023లో అమ్మకాలు ఇలా..	
సెప్టెంబరు	రూ.28.42 లక్షలు
అక్టోబరు	రూ.26.27 లక్షలు
నవంబరు	రూ.29.63 లక్షలు

2024 అమ్మకాలు ఇలా..	
సెప్టెంబరు	రూ. 15.71 లక్షలు
అక్టోబరు	రూ. 8.48 లక్షలు
నవంబర్	రూ.3.16 లక్షలు

మరిన్ని సరుకులు పెట్టాలి..



నేనెప్పుడూ ఇక్కడే సరుకులు కొంటున్నాను. సరుకులు బాగుంటున్నాయి. ధర కూడా ఇతర మార్టులతో పోల్చితే తక్కువగా ఉంటుంది. ప్రతి వస్తువునూ మార్కెట్ కంటే తక్కువ ధరకే ఇస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా ఇక్కడికే వస్తున్నా. మరిన్ని సరుకులు పెట్టాలి.

– లక్ష్మి, హడ్కో కాలనీ

అభివృద్ధి చేస్తాం..



మార్టులో గతంలో అవకతవకలు జరిగాయి. ప్రస్తుతం సాంకేతిక కారణాలు వల్ల వ్యాపారం తగ్గింది. డీఆర్‌డీఏ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి మళ్లీ అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇటీవల రూ.5 లక్షల సరుకులు తీసుకువచ్చాం.

– పుచ్చల కల్పన, ఎంఎంఎస్ అధ్యక్షులు, నరసన్నపేట

అమ్మకాలు పెంచుతాం...



ప్రస్తుతం అన్ సీజన్ కారణంగా సేల్స్ తగ్గాయి. మళ్లీ అమ్మకాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గడిచిన రెండు నెలలుగా మార్టులో బదిలీలు, స్టాఫ్ మారడం వల్ల అమ్మకాలపై దృష్టి పెట్టలేక పోయాం. ఇక నుంచి చర్యలు తీసుకుంటాం.

– కొండలరావు, ఏసీ, నరసన్నపేట



మిల్లర్లు నొల్లేస్తున్నారు



కొత్తూరు: ధాన్యం కొనుగోలు రైతుల కంటే మిల్లర్లకు ఎక్కువగా లాభం చేకూరుస్తోంది. ధాన్యంలో ఎలాంటి తేమ లేకపోయినా 80 కిలోల బస్తాను అదనంగా రెండున్నర కిలోలు తీసుకుంటున్నారు. దీంతో రైతులకు నష్టం తప్పడం లేదు. ఎకరాకు సుమారు రూ.1200 నుంచి రూ.1500 వరకు నష్టపోతున్నారు. అదనంగా ఇవ్వకపోతే వారి నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకొని అదనపు తూకం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దోపిడీకి గురవుతున్నాం..

మేం మిల్లర్ల దోపిడీకి గురవుతున్నాం. తేమ, పొల్లు లేకపోయినా 80 కిలోల బస్తా దగ్గర మరో రెండున్నర కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. దీంతో నష్టం తప్పడం లేదు. – గొంటి రమేష్, రైతు, ఎన్‌కేపురం కొత్తూరు మండలం

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

తేమ, పొల్లు పేర్లతో అదనంగా రెండున్నర కిలోల ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి. రైతులను ఈ ఇబ్బందుల నుంచి కాపాడాలి.

– కృష్ణమోహన్, రైతు వైఆర్‌పేట, కొత్తూరు

ఫిర్యాదు చేయాలి

మిల్లర్లు ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని ఫిర్యాదు చేస్తే విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 80 కిలోలు మాత్రమే తూకం వేయాలి.

– భీమారావు, సీఎస్‌డీటీ కొత్తూరు

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

- గున్నమ్మను పరామర్శించిన తిలక్



బాధితులను పరామర్శిస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: మండలంలోని చాకిపల్లిలో తెలుగుదేశం పార్టీ వర్గీయుల చేతిలో గాయపడి టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చుక్క గున్నమ్మ, ఆమె కుమార్తెను వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు మితిమీరుతున్నాయని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రాధాన్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తిలక్‌తో పాటు నాయకులు జి.మోహనరెడ్డి, పి.రమణబాబు, బి.రాజేష్, కే.జీవన్ తదితరులు ఉన్నారు.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్‌టీసీ బస్సు
- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



బస్సు ఢీకొట్టడంతో బోల్తాపడిన ట్రాక్టర్ తొట్టె

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు జంక్షన్ సమీపంలో అలికాం–బత్తిలి రోడ్డుపై గురువారం ఇసుక ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. కొత్తూరు నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ (5 స్టాప్) బస్సు ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ ఉన్న వైపున రోడ్డు పక్కన భారీ చెట్టు కొమ్మ ఉంది. ఆ కొమ్మను తప్పించే క్రమంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో ట్రాక్టర్ తొట్టె బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గానీ, బస్సులో డ్రైవర్, ప్రయాణికులకు గానీ ఎటువంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు వీరే



శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ)/ఎచ్చెర్ల క్యాంపస్/నరసన్నపేట/ఆమదాలవలస/ఎల్.ఎన్.పేట/టెక్కలి/కాశీబుగ్గ/కంచిలి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలో పార్టీ అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. అన్ని నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గం	
మార్పు దుర్గా పృథ్వీరాజ్	జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు
ముంజేటి కృష్ణమూర్తి	జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు
మహ్మద్ అలీబేగ్	జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు
రొంతు శంకరరావు	జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు
ఎచ్చెర్ల నియోజకవర్గం	
గొర్లె అప్పలనాయుడు	జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు
నేతింటి నీలమప్పడు	జిల్లా పంచాయతీరాజ్‌వింగ్ అధ్యక్షుడు
లంకపల్లి ప్రసాద్	జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు
నరసన్నపేట నియోజకవర్గం	
కేసీహెచ్ గుప్తా	జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు
పుట్టా ఆదిలక్ష్మి	జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులు
దోమ మన్మధరావు	జిల్లా బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు
ఆమదాలవలస నియోజకవర్గం	
ముత్తా విజయ్	జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు
బట్టా సత్యనారాయణ	జిల్లా వీవర్స్(చేనేత) విభాగం అధ్యక్షుడు
పప్పల రాధాకృష్ణ	జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు
కొప్పల ఈశ్వరరావు	జిల్లా మేధావుల ఫోరం విభాగం అధ్యక్షుడు

పాతపట్నం నియోజకవర్గం	
సొంట్యాన తమ్మినాయుడు	జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు
గొంటి రామ్మోహనరావు	జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు
వెలమల బాలరాజు	జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు
టెక్కలి నియోజకవర్గం	
బుడ్డా మోహన్‌రెడ్డి	జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు
ఆరంగి లక్ష్మీపతి	జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు
చింతాడ వరుణ్	జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు
పలాస నియోజకవర్గం	
సవర డుంబురు	జిల్లా ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడు
ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్	జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు
రుకునాన వెంకటరమణ	జిల్లా సోషల్‌మీడియా విభాగం అధ్యక్షుడు
ఇచ్ఛాపురం నియోజకవర్గం	
ఉలాల భారతి దివ్య	జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు
మద్దిల కాళిదాసు	జిల్లా వలంటీర్ల విభాగం అధ్యక్షులు
పత్తి అన్వేష్	జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు
తాడి ఆదిరెడ్డి	జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు

ఎంటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ఎంవీపీకాలనీ: గాయత్రీ విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ చదువుతున్న సామినేని శిరీష(22) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన శిరీష ఎంటెక్ అభ్యసించేందుకు నగరానికి వచ్చింది. ఎంవీపీ కాలనీలో తన అక్కాబావల వద్ద ఉంటూ చదువుకుంటోంది. అదే గ్రామానికి చెందిన దిలీప్‌తో ఆమెకు వివాహం జరగడంతో, వారం వారం పొందూరు వెళ్లి వస్తోంది. కాగా చదువు మధ్యలోనే పెళ్లి చేయడం, ఇటీవల తండ్రి మరణించడంతో ఆమె మనస్తాపానికి గురైంది. అలాగే వ్యవసాయ నేపథ్యం ఉన్న దిలీప్‌తో పెళ్లి చేయడం కూడా శిరీషకు ఇష్టం లేనట్లు తెలిసింది. బుధవారం ఆమె అక్కాబావ వివాహ కార్యక్రమం కోసం వేరే ఊరు వెళ్లారు. దీంతో శిరీష ఒక్కతే ఇంట్లో ఉంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చాలాసార్లు ఆమె ఫోన్‌కు కాల్ చేసినా శిరీష స్పందించకపోవడంతో కంగారుపడి, తెలిసిన వారికి సమాచారం ఇచ్చారు. వారు ఇంటి కిటికీ నుంచి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు ఆమె మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె రాత్రి ఎవరితో మాట్లాడింది? ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని పోలీసులు తెలిపారు.

నువ్వా.. నేనా!

- హోరాహోరీగా పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్
- నేటితో ముగియనున్న పోటీలు



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారుడు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారంతో ముగియనున్న ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా పాలిటెక్నిక్ కళాశాల మైదానాల వేదికగా జరుగుతున్న ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని పది ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల క్రీడాకారులు హాజరవుతున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య, పలువురు పీడీలు పర్యవేక్షిస్తున్నారు.

విజేతలు వీరే..

రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన క్రీడల్లో పలువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో ఐతం పాలిటెక్నిక్ జట్టు ప్రథమ, వెంకటేశ్వరా పాలిటెక్నిక్ జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. చెస్‌లో కె.ప్రదీప్, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రథమస్థానం, కె.హరి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ద్వితీయ స్థానం సాధించారు. మహిళల చెస్‌లో బి.రమ్య శ్రీవైష్ణవి, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ మొదటి, బి.హారిక శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ రెండో స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్‌లో కె.హర్షిత, ఎస్.గ్రీష్మ, బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో కె.కౌసల్య, సీహెచ్.తనుశ్రీ, తొలి రెండు స్థానాలు సాధించారు. టేబుల్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో పి.చంద్రమౌళి, కె.ఆనంద్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి.

కిర్రాక్ ఫీచర్లతో వీవో ఎక్స్200 సిరీస్ విడుదల



వీవో ఎక్స్ 200 సిరీస్ ఫోన్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

డాబాగార్డెన్స్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెల్‌పాయింట్ ఇండియా వీవో ఎక్స్200 సిరీస్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా ఈ మొబైల్ ఫోన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏ కంపెనీ కొత్త మొబైల్ ఫోన్లను విడుదల చేసినా అవి ముందుగా సెల్‌పాయింట్‌లోనే అందుబాటులోకి వస్తాయన్నారు. నగరంలో సెల్‌పాయింట్ సెల్‌ఫోన్లకు నిలయంగా మారిందని, వీవో ఎక్స్ 200 సిరీస్ మంచి ఫీచర్లతో మార్కెట్లోకి విడుదలైందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సిరీస్‌ను రూపొందించారన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సెల్‌పాయింట్ అధినేతను ఆయన అభినందించారు. చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 స్టోర్లకు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. వీవో ఎక్స్200 సిరీస్‌లో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని, ముఖ్యంగా కెమెరా, బ్యాటరీ, డిస్‌ప్లే వంటి వాటిపై కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. వీవో ఎక్స్ 200 సిరీస్ కొనుగోలుపై ఉచితంగా హ్యాపీ పోలా 100 వాట్స్ సౌండ్‌బార్, వీవో బడ్స్ టీడబ్ల్యూఎస్ 3ఈ ఏఎన్‌సీ అందిస్తున్నట్లు తెలిపారు. మరి కొన్ని ఉత్పత్తులపై రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, శాంసంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోనీ, హైయర్, ఏసర్ వంటి టాప్ బ్రాండ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్, యాక్సరీస్‌పై 60 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు వివరించారు. సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, వీవో సంస్థ ప్రతినిధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

అరసవల్లి: ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్ శాఖను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిద్దామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎంవి.గోపాలరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సంస్కరణల ముసుగులో ప్రభుత్వ ఆధీనంలో విద్యుత్ శాఖను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం తగదన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఆందోళనకు దిగిన విద్యుత్ కార్మికులపై ఎస్మా విధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆ రెండు రాష్ట్రాల కార్మికులకు సంఘీభావంగా మన రాష్ట్రంలో కూడా విద్యుత్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ఆందోళన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌ను డీబీటీ విధానంలో ఇస్తామని చెబుతూ ప్రైవేటీకరణకు దారులు తెరుస్తున్నారని..ఈ విధానంపై తామంతా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ జి.రమేష్‌కుమార్, సభ్యులు జె.సురేష్‌కుమార్, గురునాథరావు, లోకేశ్వరరావు, సూర్యనారాయణ, రాజారావు, టి.వి.సుబ్రహమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న జిల్లా విద్యుత్ జేఏసీ ప్రతినిధులు